వ్యాపారుల సంక్షేమానికి కృషి


ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్‌ను సత్కరిస్తున్న వ్యాపారులు

అబిడ్స్: వ్యాపారుల సమస్యలు పరిష్కరించేందుకు తాను ముందుంటానని మాజీ మంత్రి, బీఆర్ఎస్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్‌యాదవ్ పేర్కొన్నారు. గోషామహల్ నియోజకవర్గానికి చెందిన పలువురు వ్యాపారులు ఆయనను ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా తలసాని మాట్లాడుతూ..పదేళ్లుగా గోషామహల్‌లో వ్యాపారుల సంక్షేమానికి ఎంతో కృషి చేశానని పేర్కొన్నారు. బీఆర్ఎస్ ఎమ్మెల్యేగా ఉండి వ్యాపార వాణిజ్య సముదాయాల సమస్యలు పరిష్కరించడంతో పాటు వాటి అభివృద్ధికి తన సహకారం ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో బబూత్‌సింగ్ రాజ్ పురోహిత్, రాధేశ్యామ్, గన్‌పాత్, విశాల్, ఉపేన్ రత్నలీ పాల్గొన్నారు.

అమ్మవారి హుండీ ఆదాయం లెక్కింపు


హుండీని లెక్కిస్తున్న ఈవో తదితరులు

గోల్కొండ: గోల్కొండ కోటలో కొలువుదీరి ఉన్న జగదాంబిక మహంకాళి అమ్మవారి హుండీని మంగళవారం తెరిచారు. ఆలయ కార్యనిర్వహణ అధికారి శ్రీనివాసరాజు పర్యవేక్షణలో హుండీలో వచ్చిన అమ్మవారి ఆదాయాన్ని లెక్కించారు. ఈ సందర్భంగా కార్యనిర్వహణ అధికారి శ్రీనివాసరాజు మాట్లాడుతూ.. అమ్మవారి హుండీ ఆదాయ వివరాలు పారదర్శకంగా ఉంటాయన్నారు. హుండీ ద్వారా అమ్మవారికి రూ.110180 ఆదాయం వచ్చిందని తెలిపారు. దేవాదాయ శాఖ ఇన్‌స్పెక్టర్ సురేందర్, అమ్మవారి వృత్తిపని వారి సంఘం అధ్యక్షుడు బి.సాయిబాబాచారి, మహంకాళి ఆలయ పూజారి బి.సురేష్‌చారి, జగదాంబిక ఆలయ పూజారి సర్వేష్, అమ్మవారి వృత్తిపని వారి సంఘం ప్రతినిధులు తదితరులున్నారు.

అన్ని వర్గాల సంక్షేమానికి రేవంత్‌రెడ్డి కృషి


అలీ మస్కతి

చార్మినార్: ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టిన వెంటనే అన్ని వర్గాల ప్రజల సంక్షేమం కోసం సీఎం రేవంత్‌రెడ్డి నిరంతరం కృషి చేస్తున్నారని కాంగ్రెస్ పార్టీ తెలంగాణ రాష్ట్ర ప్రచార, ప్రణాళిక కమిటీ కన్వీనర్ అలీ మస్కతి అన్నారు. ప్రత్యేక తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన అనంతరం రాష్ట్రానికి రెండో ముఖ్యమంత్రిగా రేవంత్‌రెడ్డి బాధ్యతలు చేపట్టిన వెంటనే సంక్షేమ పథకాల అమలుకు శ్రీకారం చుట్టి అన్ని వర్గాల ప్రజల మన్ననలు పొందుతున్నారన్నారు. రాబోయే రంజాన్ పండుగకు రెండు రోజుల సెలవులు కేటాయించిన రేవంత్‌రెడ్డికి రాష్ట్రంలోని ముస్లిం మైనార్టీ ప్రజలు సంతోషం వ్యక్తం చేస్తున్నారన్నారు.

'కుల మతాలకతీతంగా అభివృద్ధి'


ఎమ్మెల్యే మహ్మద్ ముబీన్‌ను సన్మానిస్తున్న రాజేశ్వర్ రావు

చార్మినార్: కుల మతాలకతీతంగా పాతబస్తీలో అభివృద్ధి కార్యక్రమాలు జరుగుతాయని దూద్‌బౌలీకి చెందిన మజ్లిస్ పార్టీ నాయకుడు రాజేశ్వర్‌రావు అన్నారు. బహదూర్‌పురా నియోజకవర్గం మజ్లిస్ పార్టీ ఎమ్మెల్యే మహ్మద్ ముబీన్‌ను కార్యకర్తలు, నాయకులతో కలిసి సన్మానించిన ఆయన ఈ సందర్భంగా మాట్లాడుతూ.. బహదూర్‌పురా మజ్లిస్ పార్టీ ఎమ్మెల్యే మహ్మద్ ముబీన్ నియోజకవర్గం అభివృద్ధికి కృషి చేయనున్నారని.. తమ సమస్యల పరిష్కారానికి ఎమ్మెల్యేను సంప్రదించాలని దూద్‌బౌలీకి చెందిన మజ్లిస్ పార్టీ నాయకులు రాజేశ్వర్ రావు సూచించారు.

కేలండర్ ఆవిష్కరణ


కేలండర్‌ను ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే అక్బరుద్దీన్ ఒవైసీ

చాంద్రాయణగుట్ట: ఉప్పుగూడ డివిజన్ ఎంఐఎం పార్టీ ఆధ్వర్యంలో రూపొందించిన 2024 నూతన కేలండర్‌ను చంద్రాయణగుట్ట ఎమ్మెల్యే అక్బరుద్దీన్ ఒవైసీ బుధవారం ఆవిష్కరించారు. ఉప్పుగూడ కార్పొరేటర్ ఫహద్ బిన్ అబ్దాద్, మాజీ కార్పొరేటర్ సమద్ అబ్దాద్ చిత్రాలతో దీనిని రూపొందించారు. సీనియర్ నాయకులు వర్కల నాగరాజు, బాబు, టింకు తదితరులు పాల్గొన్నారు.

గడ్డం ప్రసాద్‌కుమార్‌కు శుభాకాంక్షలు


గడ్డం ప్రసాద్‌కు పుష్పగుచ్ఛాన్ని అందజేస్తున్న శాగంటి సోమయ్య

నాంపల్లి: రాష్ట్ర విధాన సభ సభాపతిగా ఏకగ్రీవంగా ఎన్నికైన వికారాబాదు ఎమ్మెల్యే గడ్డం ప్రసాద్‌కుమార్‌ను తెలంగాణ బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ ప్రభుత్వ ఉద్యోగుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు శాగంటి సోమయ్య బుధవారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా గడ్డం ప్రసాద్ కుమార్‌కు పుష్పగుచ్ఛాన్ని అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ ప్రభుత్వ ఉద్యోగుల సంఘం నేతలు టి.బెన్సన్, జె.సూర్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

చెత్తశుద్ధి ఏదీ..?

కార్వాన్‌లో పేరుకుపోతున్న చెత్తాచెదారం

పట్టించుకోని అధికారులు | ఇబ్బందులు పడుతున్న స్థానికులు


గోల్కొండ జమాలి దర్వాజ వద్ద రోడ్డు పక్కన పేరుకుపోయిన చెత్త

కార్వాన్ నియోజకవర్గంలోని గోల్కొండ, నానల్‌నగర్, టోలిచౌకీ డివిజన్లలో చెత్త తరలింపు పనులు సవ్యంగా జరగడం లేదు. ప్రధాన రహదారులతో పాటు బస్తీలు, కాలనీల రోడ్ల పక్కన సైతం చెత్త కుప్పలు పేరుకుపోతున్నాయి. చెత్తతో పాటు కూల్చిన భవనాల శిథిలాలు, భవన నిర్మాణం కోసం తవ్వడంతో బయటపడిన వ్యర్థాలను, మట్టిని డీసీఎంలలో తెచ్చి రోడ్ల పక్కన వేసేస్తున్నారు. చెత్తను ఏరే రిక్షా కార్మికులు సైతం గుట్టుచప్పుడు కాకుండా చెత్తను రోడ్ల పక్కనే డంప్ చేస్తున్నారు. పారిశుద్ధ్య పనులు పర్యవేక్షించే సూపర్‌వైజర్లు, పారిశుద్ధ్య యూనిట్ సభ్యులు పట్టించుకోవడం లేదు. ఫలితంగా రోడ్లపై వాహనాల రాకపోకలకు అంతరాయం కలుగుతుంది. – గోల్కొండ

"చెత్తను ఎప్పటికప్పుడు తరలించాలి..



దోమలు మళ్లీ పెరిగిపోయాయి. చిన్న పిల్లలు దోమల కారణంగా రెండు గంటలు కూడా నిద్రపోవడం లేదు. దోమ కాటుతో వస్తున్న రోగాలతో దవాఖానాలకు తిరగడంతోనే సరిపోతుంది. అధికారులు చెత్తను ఎప్పటికప్పుడు తరలిస్తు దోమలు పెరగకుండా చూడాలి."

– రాజీ, గృహిణి, కార్వాన్

ఖాళీ స్థలాల్లో డంపింగ్..

పలు ప్రాంతాల్లో చెత్త రోజులు తరబడి ఉండిపోతుంది. ఈ చెత్త కాస్తా కుళ్లి దుర్గంధం వ్యాపిస్తుంది. గుడిమల్కాపూర్‌లో సైతం ఇదే దుస్థితి నెలకొని ఉంది. ఖాళీ స్థలాల్లో డంపింగ్ చేసిన వ్యర్థాలు, చెత్త గుట్టలుగా పేరుకుపోతుంది. బల్దియా అధికారులుగానీ స్థానిక నాయకులు గానీ పారిశుద్ధ్య పనులను పట్టించుకోవడం లేదు. మరో వైపు పారిశుద్ధ్య శాఖ అధికారులు పత్తాలేకుండాపోతున్నారు. కార్వాన్ నియోజకవర్గానికి ఉన్న పారిశుద్ధ్య కోఆర్డినేటర్ ఏ కార్యాలయంలో అందుబాటులో


ఎండీ లైన్స్–గోల్కొండ రోడ్డు పక్కన..

ఉంటాడో తెలియని పరిస్థితి నెలకొని ఉంది. కోఆర్డినేటర్ ఎవరో తమకు ఇప్పటి వరకు తెలియదని పలువురు బస్తీలు, కాలనీల సంఘాల ప్రతినిధులు అంటున్నారు. సుదీర్ఘ కాలంగా పారిశుద్ధ్య కోఆర్డినేటర్ కేవలం ఫోన్‌లు, మెసేజ్‌ల ద్వారానే పనులు కానిస్తున్నారని ఆరోపణలు వస్తున్నాయి. రాష్ట్రంలో ప్రభుత్వం మారిన కూడా అధికారులు తమ పద్ధతిని మార్చుకోవడం లేదని కార్వాన్ నియోజకవర్గం కాంగ్రెస్ నాయకుడు కె.కృష్ణా ఆరోపిస్తున్నారు. పారిశుద్ధ్య అధికారుల తీరు ఇలాగే ఉంటే రోడ్లు, కార్యాలయాల వద్దనే వారిని నిలదీస్తామని ఆయన హెచ్చరించారు.

మళ్లీ విజృంభిస్తున్న డెంగీ..

పారిశుద్ధ్య పనులు సవ్యంగా జరగకపోవడంతో విష జ్వరాలు మళ్లీ విజృంభిస్తున్నాయి. ఆరు నెలల క్రితం ప్రజలను వణికించి ఎందరినో పొట్టనపెట్టుకున్న డెంగీ వ్యాధి మళ్లీ పంజా విసిరింది. దోమలు మళ్లీ పెరగడంతో డెంగీతో పాటు ఇతర విష జ్వరాలు ప్రబలుతున్నాయి. 4 నెలల నుంచి దోమలు బాగా పెరిగాయని పలువురు మహిళలు అంటున్నారు. ఇదిలా ఉండగా గోల్కొండ ఏరియా ఆస్పత్రికి డెంగీ బారిన పడిన వారు ఎక్కువగా వస్తున్నారని గోల్కొండ ఏరియా ఆస్పత్రి మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ మజహర్‌ఉల్లా అన్నారు.

ప్రజా సంక్షేమమే కాంగ్రెస్ ధ్యేయం


శిక్షణలో ప్రశంస పత్రాలను అందుకుంటున్న కురాకుల కృష్ణ

గోల్కొండ: ప్రజా సంక్షేమమే ధ్యేయంగా కాంగ్రెస్ ప్రభుత్వం పని చేస్తుందని కార్వాన్ సీనియర్ కాంగ్రెస్ నాయకులు, రాష్ట్ర ఎరుకల సంఘం ప్రధాన కార్యదర్శి కురాకుల కృష్ణ అన్నారు. బుధవారం పీవీ నర్సింహారావు తెలంగాణ వెటర్నరీ యూనివర్సిటీ ఆధ్వర్యంలో పందుల పెంపకంపై ఒక రోజు శిక్షణ కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమంలో ఆయన పాల్గొని ప్రశంసాపత్రాన్ని పొందారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రాష్ట్ర ఎరుకల సంఘం ప్రతినిధులు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డితో పాటు పశుసంవర్ధక శాఖ మంత్రులతో కలవడం జరిగిందని అన్నారు. ఎరుకుల స్వయం ఉపాధితో పాటు వారి అభ్యున్నతికి ప్రత్యేక పథకాలు ప్రారంభించేలా చర్యలు తీసుకోవాలని కోరామన్నారు.

సన్మానం


గడ్డం ప్రసాద్‌కుమార్‌ను సన్మానిస్తున్న గౌరి సతీష్

అబిడ్స్: తెలంగాణ రాష్ట్ర నూతన స్పీకర్‌గా ఎంపికైన గడ్డం ప్రసాద్‌కుమార్‌ను రాష్ట్ర కాంగ్రెస్ అధికార ప్రతినిధి గౌరి సతీష్ ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా గౌరి సతీష్ మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో రాష్ట్రం దేశంలోనే అగ్రగామిగా నిలుస్తుందన్నారు. దొరల పాలన పోయి ఇందిరమ్మ రాజ్యం వచ్చిందన్నారు. ప్రజలంతా కాంగ్రెస్ పాలనతో సంతోషంగా ఉన్నారని గౌరి సతీష్ అన్నారు.

బంగారు తెలంగాణలో ఉద్యోగుల పాత్ర కీలకం


ప్రొ. కోదండరాంను సత్కరిస్తున్న ఎస్ఎం.ముజీబ్ హుస్సేని

అబిడ్స్: బంగారు తెలంగాణ సాధనలో ఉద్యోగుల పాత్ర ఎంతో కీలకమని తెలంగాణ ఉద్యమ ప్రధాన నాయకుడు ప్రొఫెసర్ కోదండరాం పేర్కొన్నారు. ఉద్యోగుల కష్టంతోనే తెలంగాణ రాష్ట్రం ఏర్పడిందని ఆయన గుర్తుచేశారు. కొత్తగా కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడడంతో ప్రొ. కోదండరాంను హైదరాబాద్ జిల్లా టీఎన్జీఓస్ అధ్యక్షుడు డాక్టర్ ఎస్ఎం ముజీబ్ హుస్సేని ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా కోదండరాం మాట్లాడుతూ..ఉద్యోగులు, నిరుద్యోగ సమస్యలన్నీ కాంగ్రెస్ ప్రభుత్వం పరిష్కరిస్తుందన్నారు. అందరి కృషితోనే కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిందన్నారు. అనంతరం ఎస్ఎం. ముజీబ్ హుస్సేని మాట్లాడుతూ.. బంగారు తెలంగాణ సాధనకు తమ ఉద్యోగులందరూ కృషి చేస్తారని పేర్కొన్నారు.

అయోధ్య రామ మందిరం అక్షింతలతో ప్రదర్శన


పూజల్లో పాల్గొన్న బీజేపీ నాయకులు ఉమామహేంద్ర

చార్మినార్: అయోధ్యలోని శ్రీరామ్ జన్మభూమి తీర్థ క్షేత్ర నుంచి నగరానికి వచ్చిన రామ మందిరం అక్షింతలతో రామ భక్తులు, బీజేపీ నాయకులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. కాలాభైరవ హనుమాన్ మందిరం నుంచి అక్షింతల కలశ పాత్రను తలపై పెట్టుకుని కబుతర్ ఖానా తదితర ప్రాంతాల్లో రామ భక్తులు ప్రదర్శన నిర్వహించారు. ప్రదర్శన అనంతరం తిరిగి ఆలయానికి చేరుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో రామ భక్తులతో పాటు బీజేపీ టి.ఉమా మహేంద్ర, నరేష్, సురేందర్, పంకజ్, ప్రవీన్ బాగ్డీ, కునాల్ రావు తదితరులు మాట్లాడుతూ.. జనవరి 22న అయోధ్యలోని రామ మందిరం ప్రారంభోత్సవం సందర్భంగా నగరంలో ఈ పూజా కార్యక్రమాలు కొనసాగుతున్నాయన్నారు.

పరాంకుశానికి తెలుగువర్సిటీ కీర్తి పురస్కారం



నాంపల్లి: పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం 2021కి గాను కీర్తి పురస్కారాన్ని ప్రముఖ పాత్రికేయుడు పరాంకుశం వేణుగోపాల స్వామికి బుధవారం తెలుగువర్సిటీ ఉపాధ్యక్షుడు ఆచార్య తంగెడ కిషన్‌రావు అందజేశారు. మూడున్నర దశాబ్దాలుగా పత్రికారంగంలో వివిధ స్థాయిల్లో విశేష అనుభవం కలిగిన పరాంకుశంకు తెలుగువర్సిటీ పత్రికా రంగానికి చేసిన సేవలను గుర్తించి రూ.50116 నగదు పురస్కారం, ప్రశంసాపత్రం అందజేసి సత్కరించారు. రింగు రామ్మూర్తి, ఆచార్య రమేష్ తదితరులు పాల్గొన్నారు.

జనవరి 22ను సెలవురోజుగా ప్రకటించాలి



సుల్తాన్‌బజార్: అయోధ్య రామ మందిరం ప్రారంభం, పునః ప్రాణ ప్రతిష్ఠ రోజైన 2024 జనవరి 22ను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సెలవురోజుగా ప్రకటించాలని అఖిలభారత హిందూ మహాసభ జాతీయ ఉపాధ్యక్షుడు, టీటీడీ ధర్మ ప్రచార పరిషత్ సభ్యుడు స్వామి కమలేష్ మహారాజ్ పేర్కొన్నారు. ఆయన అయోధ్య రామ జన్మభూమి తీర్థ క్షేత్ర ట్రస్ట్ అధ్యక్షుడు మహంత్ నృత్య గోపాల్‌దాస్, కార్యదర్శి చంపత్ రాయ్‌ను వేర్వేరుగా కలిసి ఏర్పాట్లపై చర్చించారు. ఉచితంగా రైళ్లు, బస్సులను నడపాలని అభ్యర్థించారు.

పుస్తకావిష్కరణ

గన్‌ఫౌండ్రీ: తెలంగాణ రాష్ట్ర భాషా సాంస్కృతిక శాఖ సౌజన్యంతో సాహితీ జిగిషాల ఆధ్వర్యంలో యువ రచయిత గిన్నారపు ఆదినారాయణ రచించిన 'నానీల సుగంధం'పుస్తకావిష్కరణ సభ బుధవారం రవీంద్రభారతిలో నిర్వహించారు. ఈ సందర్భంగా కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు గ్రహీత ఆచార్య ఎన్.గోపీ మాట్లాడుతూ.. చెప్పాల్సిన విషయాన్ని తక్కువ పదాలతో బలంగా చెప్పడంలో నానీలను మించిన సాహితీ ప్రక్రియ మరొకటి లేదని తెలిపారు. యువ రచయిత ఆదినారాయణ భవిష్యత్తులో మరిన్ని పుస్తకాలు తీసుకురావాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో ఓయు అసిస్టెంట్ ప్రొఫెసర్ ఎస్.రఘు, హెచ్‌సీయూ తెలుగుశాఖ అధ్యక్షుడు ఆచార్య డి.వెంకటేశ్వరరావు, సాహితీ జిగిష కార్యదర్శి లలితవాణి, తెలంగాణ మహిళా విశ్వవిద్యాలయం తెలుగు అధ్యాపకులు ఎం.దేవేంద్ర, నిజాం కళాశాల అసిస్టెంట్ ప్రొఫెసర్ ఎస్.చంద్రయ్య పాల్గొన్నారు.



అధికారులు పనితీరును మెరుగుపర్చుకోవాలి


సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కౌసర్

గోల్కొండ: అధికారులు తమ పనితీరును మరింత మెరుగుపర్చుకోవాలని ఎమ్మెల్యే కౌసర్‌మోహియుద్దీన్ అన్నారు. బుధవారం ఆయన ఎండిలైన్స్ ఒవైసీ కమ్యూనిటీహాల్‌లో వివిధ శాఖల అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ముందుగా బల్దియా అధికారులతో మాట్లాడారు. బల్దియా వార్డు కార్యాలయాల సిబ్బందిపైనే ఎక్కువ ఫిర్యాదులు వస్తుంటాయన్నారు. తమకు నిర్దేశించిన పని వేళలలో అధికారులు వార్డు కార్యాలయంలో ప్రజలకు అందుబాటులో ఉండాలని ఆయన సూచించారు. జలమండలి సిబ్బంది సైతం సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరించాలని ఆయన పేర్కొన్నారు. ఏ శాఖ అధికారులైనా సరే క్షేత్రస్థాయిలో పర్యటించి సమస్యలను తెలుసుకోవడమే కాకుండా జరుగుతున్న పనులను కూడా సకాలంలో పూర్తి చేయించాలని ఆయన సూచించారు. కార్యక్రమంలో వివిధ శాఖల అధికారులతో పాటు నానల్‌నగర్ కార్పొరేటర్ మహ్మద్‌నసీరుద్దీన్, నాయకులు వజీఉజ్‌జమా, హారూన్‌ఫరాన్, బదరుద్దీన్,ఆలీముద్దీన్ తదితరులున్నారు.

వైభవంగా కార్తీకమాసం పోలి పాడ్యమి వేడుకలు


పోలి పాడ్యమి వేడుకల్లో పాల్గొన్న భక్తులు

అబిడ్స్: కార్తీకమాసం పోలి పాడ్యమి వేడుకలు వైభవంగా నిర్వహించారు. గుడిమల్కాపూర్ సాయిబాబా త్రయంబకేశ్వ ఆలయంలో బుధవారం తెల్లవారుజామున పోలి స్వర్గ పూజలు నిర్వహించారు. మహిళలు పెద్ద ఎత్తున పాల్గొని దీపాలంకరణ నిర్వహించారు. ఆలయం శోభాయమానంగా మారింది. పరిసర ప్రాంతాల నుంచి పెద్ద ఎత్తున భక్తులు వచ్చి పోలి పాడ్యమి వేడుకల్లో పాలుపంచుకున్నారు. అమ్మవారి పూజలు, గౌరీరథ వేడుకలు వైభవోపేతంగా వేదపండితులు నిర్వహించారు. ఆలయ నిర్వాహకులు దీపాలను నీటిలో నిమజ్జనం చేసే విధంగా ఏర్పాట్లు నిర్వహించారు.

ఆకట్టుకున్న ప్రవచనాలు..

నెల రోజులుగా ప్రతిరోజూ శివుడి ప్రవచనాలు భక్తులకు బోధించిన బోధకురాలు సుజాతకు ఆలయ నిర్వాహకులు ఘనంగా సన్మానం చేశారు. ఉదయం సమయాల్లో ఆధ్యాత్మిక భావాలతో సుజాత అందరు భక్తులను మంత్రముగ్దులను చేసింది.


ప్రవచనాల బోధకురాలు సుజాతను సత్కరిస్తున్న దృశ్యం